క్లుప్తంగా

రైతు భరోసా అర్హుల జాబితా ప్రదర్శన



ఉండూరు ఆర్బీకే వద్ద జాబితా ప్రదర్శనకు పెట్టిన ఏఓ సత్యప్రసాద్

రామచంద్రపురం రూరల్: ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో పారదర్శకతకు పెద్దపీట వేస్తూ అవినీతికి తావులేకుండా నిర్వహిస్తున్న క్రమంలో 'రైతు భరోసా' అర్హుల జాబితాను అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద ప్రదర్శనకు ఏర్పాటు చేసినట్లు మండల వ్యవసాయ అధికారి ఎన్.సత్యప్రసాద్ గురువారం విలేకరులకు తెలిపారు. రైతు భరోసా అర్హుల జాబితాలో ఏవైనా పొరపాట్లు ఉన్నట్లు గుర్తిస్తే రైతులు గ్రామ వ్యవసాయ సహాయకులను, వ్యవసాయ సిబ్బందిని సంప్రదించి మార్పులు చేయించుకోవాలని సూచించారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి విత్తనాలు రైతు భరోసా కేంద్రాల వద్ద సిద్ధంగా ఉంచినట్లు ఏఓ తెలిపారు.

తడి, పొడి చెత్త విడివిడిగా అందించేలా అవగాహన



సమగ్ర చెత్త నిర్వహణపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సర్పంచ్ సతీష్‌రావు తదితరులు

రామచంద్రపురం రూరల్: జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా మండలంలోని హసన్‌బాదలో సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు ఆధ్వర్యంలో తడిచెత్త, పొడిచెత్త విడివిడిగా అందించేలా గురువారం గ్రామ ప్రజల్లో అవగాహన కల్పించారు. సర్పంచ్ అధ్వర్యంలో సచివాలయ సిబ్బందితో కలసి ఇంటింటికీ వెళ్లి చెత్తను వేరు చేసి అందించడం ద్వారా పంచాయతీ శానిటరీ సిబ్బందికి సహకరించాలని కోరారు.

తగలబెడితే పొలాల భూసారానికి ముప్పు



కె.గంగవరంలో తగలబెట్టిన పొలాలు

కె.గంగవరం: మాసూళ్లు పూర్తి చేసిన పంట పొలాల్లోని గడ్డిని తగలపెట్టడం వల్ల భూమిలోని అతి చిన్న సూక్ష్మజీవులు చనిపోయి సారం పోతుందని ఏఓ బలుసు రవి రైతులకు సూచించారు. మండలంలోని పలు గ్రామంలో గురువారం వ్యవసాయ శాఖ సిబ్బందితో కలసి ఆయన పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు. రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ పొలంలోని మోళ్లు, గడ్డి తగళపెట్టడడం వల్ల కాలుష్యం పెరిగిపోవడంతో పాటు అగ్ని ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందన్నారు. నిప్పు పెట్టడం వల్ల రైతులకు ఏ ఉపయోగం లేదని పొలంలో సూపర్ ఫాస్పేట్ వేసి దమ్ము చేస్తే దుబ్బులు, గడ్డి బాగా చివికి పోయి భూమిలో కలసి భూసారం పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

బ్యాంకు సేవలను వినియోగించుకోవాలి



చోడవరంలో ప్రజలకు స్టేట్ బ్యాంక్ సేవలను వివరిస్తున్న బ్యాంకు సిబ్బంది

రామచంద్రపురం రూరల్: మండలంలోని చోడవరంలో స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా రామచంద్రపురం బ్రాంచ్ ఆధ్వర్యంలో గురువారం సాయంకాలం గ్రామ సభ నిర్వహించారు. సర్పంచ్ నేదునూరి సంతోషమ్మ అధ్యక్షతన జరిగిన సభలో రీజినల్ మేనేజర్ తపోధన్, చీఫ్ మేనేజర్ వి.శ్రీనివాస్‌లు మాట్లాడుతూ బ్యాంకు ద్వారా రైతులు, డ్వాక్రా సభ్యులు, సాధారణ ప్రజానీకానికి అందిస్తున్న పలు సేవలను వివరించారు. సుకన్య సమృద్ధి యోజన, పీఎంఎస్‌బీవై, పీఎం జేజేబీవై పథకాల ఉపయోగాలను వివరించారు. ఎవరిపైనా ఆధారపడకుండా బ్యాంకు సేవలను నేరుగా వినియోగించుకోవాలని వివరించారు. గ్రామంలో డ్వాక్రా మహిళలకు రూ.3 కోట్లు, రామచంద్రపురం పరిసర ప్రాంతాల్లో రూ.7 కోట్లు రుణాలుగా మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి పి.త్రినాథ్, వీఆర్‌ఓ పంపన విష్ణుమూర్తి, బ్యాంక్ సీఎస్‌బీ పాయింట్ సాయి పాల్గొన్నారు.

ఆక్వాకు తప్పని ఉక్కపోత

- ఎండ తీవ్రతకు మరుగుతున్న నీరు
- తేలుతున్న రొయ్యలు
- తక్కువ కౌంట్‌లోనే తప్పని పట్టుబడి
- యాజమాన్య పద్ధతులపై శాస్త్రవేత్త సూచనలు



గొల్లపాలెంలో ఎండతీవ్రతకు చిన్నకౌంట్‌లోనే రొయ్యలను పడుతున్న దృశ్యం

కాజులూరు: ప్రచండ భానుడి ఉగ్రరూపంతో రోజురోజుకీ ఎండలు పెరుగుతుండగా భూమిపై ఉండే మానవాళితో పాటు చెరువుల్లో నీరు వేడెక్కి అందులో నివసించే చేపలు, రొయ్యలు ఉక్కిరిబిక్కిరవుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతలతో చెరువునీటిలోని ప్లాంటేషన్ చనిపోయి నీరు పలచబడి సూర్యరశ్మి నేరుగా అడుగు భాగాన్ని చేరుతుంది. దీంతో నీటి నాణ్యత సైతం పాడై చెరువుల్లో రొయ్యలు చనిపోతున్నాయి. ఆక్వాసాగులో రొయ్యల ఎదుగుదలకు నాణ్యమైన నీటి నిర్వహణపైనే ఆధారపడి ఉంటుంది. వేసవి ఎండ తీవ్రతకు నీటి ఉష్ణోగ్రత పెరగటంతో నీటి నాణ్యత ప్రమాణాలపై వ్యత్యాసాలు ఏర్పడి రొయ్యలు చనిపోయేందుకు కారణమౌతుంది. ఈ పరిస్థితుల్లో చిన్న కౌంట్‌లోనే రొయ్యలు పట్టుబడి పట్టవలసి వస్తుండటంతో రైతులు తీవ్ర నష్టాలకు గురవుతున్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలోని కాజులూరు మండలంలో సుమారు 10 వేల ఎకరాల్లోనూ, కె.గంగవరం, రామచంద్రపురం మండల గ్రామాలలో మరో పదివేల ఎకరాల్లోనూ రైతులు రొయ్యల చెరువులను సాగు చేస్తున్నారు. అధిక ఉష్ణోగ్రతలతో రొయ్యలు చనిపోతుండటంతో రూ.లక్షల్లో నష్టం వస్తుందని రైతులు వాపోతున్నారు.

రొయ్యల జీవన ప్రక్రియలోనూ ఇబ్బందులు

రొయ్యలు శీతల రక్తపు జీవులు వీటి శరీరంపై ఉష్ణోగ్రతల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. రొయ్యలు అవసరమైన ఉష్ణోగ్రత 26 డిగ్రీల నుంచి 28 డిగ్రీల సెల్సియస్ అయినప్పటికీ 32 డిగ్రీల ఉష్ణోగ్రత వరకూ వాటి పెరుగుదలపై ఎటువంటి ప్రభావం ఉండదు. ప్రస్తుత పరిస్థితులలో ఉష్ణోగ్రత 32 డిగ్రీల కంటే పెరిగిపోవటంతో రొయ్యలు మేత సక్రమంగా తీసుకోక ఎదుగుదల తగ్గింది. దాంతో పాటు వాటిలో వ్యాధి నిరోధకశక్తి తగ్గిపోయి పలు వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది.

నీటి నాణ్యతపై ప్రభావం

వేసవిలో ఎండ వేడి కారణంగా ఉష్ణోగ్రతలు పెరగటంతో పాటు ఇతర నీటి నాణ్యత ప్రమాణాలపైనా ప్రభావం చూపుతుంది. వేసవి తీవ్రతకు సాగు చెరువుల్లో నీటి ఆవిరి ప్రక్రియ ఎక్కువగా ఉంటుంది. దీని వలన నీటి నాణ్యత క్షీణించటంతో పాటు, ఉష్ణోగ్రత స్థిరీకరణ ఉండదు. ఉష్ణోగ్రత హెచ్చుతగ్గులతో నీటి నాణ్యత ప్రమాణాలు నియంత్రించలేనంత హెచ్చుతగ్గులను చూపిస్తాయి. చెరువునీటిలో ఆక్సిజన్ తగ్గి డీవో, పీహెచ్ సాధారణ స్థాయి కంటే తగ్గిపోయే అవకాశాలు ఉండగా సెలినిటీ, ఆల్కనిటీ, హార్డ్‌నెస్, అమోనియా, నైట్రేట్ వంటివి సాధారణ స్థాయి కంటే పెరిగిపోయే అవకాశం ఉంది.

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి



వేసవిలో రొయ్యల సాగులో రన్నింగ్ మోర్టాలిటీ ఎక్కువగా ఉంటుంది. ఎండతీవ్రతకు రొయ్యలు ఒత్తిడికి గురి కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. రైతులు నీటి నాణ్యత ప్రమాణాలపై దృష్టి సారించి ఎప్పటికప్పుడు నీటి పరీక్షలు చేయిస్తుండాలి. ల్యాబ్ నివేదిక ఆదారంగా నీటి నాణ్యత ప్రమాణాల హెచ్చుతగ్గులపై తగు చర్యలు చేపట్టాలి.

– మురళీధర్ పి.ఆండే, శాస్త్రవేత్త, ఇన్‌చార్జి సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్, కాకినాడ

వేగంగా బాల ఆధార్ నమోదు



చిన్నారుల వివరాలను నమోదు చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

కపిలేశ్వరపురం: పుట్టిన బిడ్డల వివరాలతో ఆధార్ నమోదు చేయించే ప్రక్రియను సచివాలయ ఉద్యోగులు వేగవంతం చేస్తున్నారు. ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి ఆదేశాలపై మండలంలోని 19 గ్రామాల్లో సచివాలయ ఉద్యోగులు ఇంటింటా ప్రచారం చేస్తూ బాలల తల్లిదండ్రుల్లో అవగాహన కల్పించారు. షెడ్యూల్ ప్రకారం బాలల వివరాలను నమోదు చేయిస్తున్నారు.

రేపు వలంటీర్లకు అవార్డుల ప్రదానం

కె.గంగవరం: మండలంలోని వలంటీర్లకు రేపు (ఆదివారం) అవార్డులు ప్రదానం చేయనున్నట్లు ఎంపీడీఓ ఎన్.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ద్రాక్షారామలోని పేపకాయల బాబ్జి కల్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు రాష్ట్ర బీసీ సంక్షేమ, సమాచార, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ చేతుల మీదుగా సేవారత్న, సేవామిత్ర, సేవావజ్ర అవార్డులు అందిస్తామని ప్రజాప్రతినిధులు, వలంటీర్లు హాజరు కావాలని ఆయన కోరారు.

పేదరికం నిర్మూలనే లక్ష్యంగా పాలన

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- ఏడిదలో గడప గడపకూ మన ప్రభుత్వం



గ్రామంలో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: రాష్ట్రంలో పేదరికం నిర్మూలనే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం సాయంత్రం ఏడిద సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం అధ్యక్షతన జెడ్పీటీసీ సభ్యురాలు కుడిపూడి భవాని తదితరులతో కలిసి గ్రామంలోని జమ్మిచెట్టు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ప్రతి ఇంటికీ వెళ్లి మూడేళ్ల పాలనలో ప్రభుత్వం ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. స్థానికులను సమస్యలడిగి తెలుసుకుని అక్కడికక్కడే వాటి పరిష్కారానికి ఎంపీడీఓ ఐ.రాజు, గ్రామ కార్యదర్శి వుండమట్ల వీర్రాజుకు ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ వ్యక్తిగత సమస్యలతో పాటు క్షేత్రస్థాయిలో ప్రజా అవసరాలను గుర్తించి అందుకు అవసరమైన చర్యలు చేపట్టేందుకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం దోహదపడుతోందన్నారు. సచివాలయానికి రూ.20 లక్షలు చొప్పున మంజూరు చేస్తున్న నిధులతో రోడ్లు, డ్రైన్లు, విద్యుత్ తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నామని ఎమ్మెల్సీ తోట తెలిపారు. వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, సొసైటీ చైర్మన్ రామిశెట్టి శ్రీహరి, ఆర్‌బీకే మండల కమిటీ డైరెక్టర్ చిలుకూరి బుజ్జి, మండల కన్వీనర్ పిల్లా వీరబాబు, గ్రామ కమిటీ అధ్యక్షుడు పలివెల సుధాకర్, వై.సీతానగరం ఉప సర్పంచ్ వరదా చక్రవర్తి, పార్టీ నాయకులు కుడిపూడి రాంబాబు, తాతపూడి రాజేష్, బేతా వెంకటేశ్వరరావు, పడిమిపల్లి నానాజీ, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ

మండపేట: విద్యుత్ సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తోందని సీజీఆర్‌ఎఫ్ చైర్మన్, రిటైర్డ్ జడ్జి బి.సత్యనారాయణ అన్నారు. స్థానిక మారేడుబాక సబ్‌స్టేషన్ వద్ద గురువారం ఏర్పాటు చేసిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ 2003లో ప్రభుత్వం కన్స్యూమర్ గ్రీవెన్సెస్ రిడ్రసల్ ఫోరం (సీజీఆర్‌ఎఫ్) ఏర్పాటు చేసిన నాటి నుంచి 7,394 కేసులు రాగా అన్నింటిని పరిష్కరించామన్నారు. వీటిలో 98 కేసులకు రూ.5.2 లక్షలు నష్టపరిహారాన్ని వినియోగదారులకు ఇప్పించామన్నారు. బిల్లింగ్ లోపాలు, లోఓల్టేజీ, విద్యుత్ లైన్ల మరమ్మతులు తదితర సమస్యలు ఎక్కువగా వస్తున్నాయన్నారు. నిర్ణీత గడువులోగా పరిష్కారం కాని సమస్యలపై వినియోగదారులు సీజీఆర్‌ఎఫ్‌ను ఆశ్రయిస్తే న్యాయం పొందవచ్చునన్నారు. అనంతరం ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను అధికారులు స్వీకరించారు. తొలుత ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక, విద్యుత్ ఆదాకు తీసుకోవాల్సిన చర్యలు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. సీజీఆర్‌ఎఫ్ కమిటీ సభ్యులు పి.శ్రీనివాస్, ఆర్.సురేంద్రకుమార్, ఈఈ దాట్ల శ్రీధరవర్మ, ఏడీఈ జి.తిరుమలరావు, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజా చైతన్యం కోసమే కళలు



ఇప్టా జెండాను ఎగరవేస్తున్న రాము తదితరులు

రామచంద్రపురం: ప్రజల్లో చైతన్యాన్ని కలిగించేందుకే కళలు పుట్టుకొచ్చాయని ప్రజా నాట్యమండలి రామచంద్రపురం శాఖ అధ్యక్షుడు గొర్రెల రాము అన్నారు. ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ (ఇప్టా) 80వ ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో పట్టణంలోని బ్రాడీపేటలో బాబ్జి సైకిల్ షాపు వద్ద గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాము ఇప్టా జెండాను ఎగరవేశారు. ఆయన మాట్లాడుతూ 1943 మే 25న బొంబాయి నగరంలో ప్రముఖ కవులు కళాకారులు నటులతో కలసి ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ ఏర్పడిందన్నారు. నాటి నుంచి దేశ వ్యాప్తంగా ప్రజానాట్య మండలి పేర్లతో విస్తరించబడిందని వివరించారు. ఏపీలో ప్రజా నాట్యమండలిగా డాక్టర్ గరిగిపాటి రాజారావు నాయకత్వంలో ఏర్పడిందన్నారు. గత 80 సంవత్సరాలుగా దేశంలో జరుగుతుందన్న ప్రజా కార్మిక, రైతు కూలీ సమస్యలపై జరుగుతున్న పోరాటాల్లో నిత్యం చైతన్యం పరుస్తూ పోరాటాల్ని విజయవంతం చేయటంలో ప్రముఖ పాత్ర వహించిందన్నారు. ఈ ప్రవంతిలో జానపద కళారూపాలుగా రూపొందించి సాంఘిక సమస్యలపై సాంఘిక నాటకాల ద్వారా సమస్యలకు పరిష్కారం చెబుతూ సాహిత్య రంగంలో నూతన ఒరవడి సృష్టించిందన్నారు. అనేక మంది ఉన్నత స్థాయి కళాకారులుగా తయారు చేసిన ఘనత ఇప్టాకి ఉందని తెలిపారు. కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి కార్యకర్తలు, ఎం.ప్రేమానందం, ఎస్.శారదాదేవి, కె.చంద్రరావు, గొర్రెల కృష్ణ, జి.బాబూరావు, బాబ్జి, వి.రాంబాబు, జి.శ్రీను పలు చైతన్యవంతమైన పాటలు పాడి అలరించారు. మహ్మద్ గౌస్, చింతా తాతారెడ్డి, ఆర్ సత్తిబాబు, ఆర్.గోవిందరాజు, ఎం.సత్యభద్రరాజు ఎం.అప్పారావు, పి.రాము తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మాజీ ఎంపీపీ వైఎస్సార్ సీపీలో చేరిక

- పార్టీ బలోపేతానికి పాటు పడాలని ఎమ్మెల్సీ తోట సూచన



ఎమ్మెల్సీ తోట సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన ప్రభాకరరావు

మండపేట: ఏడిదలో జరుగుతున్న గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో గురువారం వైఎస్సార్ సీపీలోకి పలువురు చేరారు. టీడీపీ మాజీ ఎంపీపీ ఉడతా ప్రభాకరరావుతో పాటు చేనేత సంఘం నాయకుడు పున్నం హనుమంతరావు, అవ్వారి సత్యనారాయణ, ఉడతా బులి వీర్రాజు, ఉడతా రమేష్, తమ్మిన వీరవెంకట సత్యనారాయణ, దవులూరి ఆంజనేయులు, దొడ్డి సత్తిబాబు, దొడ్డి సత్యవతి, గొల్లవిల్లి సుబ్బారాయుడు తదితరులు పార్టీలో చేరారు. ఎమ్మెల్సీ తోట వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించి పార్టీ బలోపేతానికి పాటుపడాలని కోరారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ ప్రభాకరరావు తదితరులు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారంజక పాలన, కుల మత వర్గాలకు అతీతంగా ఆపదలో ఉన్న వారికి అండగా నిలిచే ఎమ్మెల్సీ తోట నాయకత్వానికి ఆకర్షితులై తాము పార్టీలో చేరామన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి శక్తివంచన లేకుండా పనిచేస్తామన్నారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాగిస్తున్న పాలనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. ఎన్నో ఏళ్లుగా టీడీపీ వెన్నుదన్నుగా ఉన్న వారు ఆ పార్టీని వీడి వైఎస్సార్ సీపీలో భారీగా జరుగుతున్న చేరికలే అందుకు నిదర్శనమన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓటేసి సీఎం జగన్ రుణం తీర్చుకుంటామని ఎక్కడికక్కడ ప్రజలు చెబుతున్నారని ఎమ్మెల్సీ తోట పేర్కొన్నారు. సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, సొసైటీ చైర్మన్ రామిశెట్టి శ్రీహరిబాబు, ఆర్‌బీకే మండల కమిటీ డైరెక్టర్ చిలుకూరి బుజ్జి, కుడిపూడి రాంబాబు, గ్రామ కమిటీ అధ్యక్షుడు పలివెల సుధాకర్, బండారు కృష్ణ, కొండేటి కాశీకృష్ణ, బేతా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



నిప్పుల కొలిమి

నిర్మానుష్యంగా ఉన్న సోమేశ్వరం-రాజానగరం ప్రధాన రహదారి

- పెరిగిన సూర్యతాపం
- 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

రాయవరం: రోహిణీ కార్తెలో రోళ్లు పగులుతాయన్నది సామెత. ఈ సామెత నిజమే అన్నట్టుగా ఎండలు మండిపోతున్నాయి. గురువారం ఉష్ణోగ్రతలు 44 డిగ్రీలు దాటడం ఆందోళన కలిగిస్తోంది. ఉదయం ఏడు గంటల నుంచే ఉక్కపోత వాతావరణం నెలకొంటోంది. ఎనిమిది గంటల నుంచి సూరీడు చుర్రుమనిపిస్తున్నాడు. రాత్రి ఏడు గంటలైనా వేడి తగ్గడం లేదు. ఒక పక్క ఎండ మరో పక్క వేడి గాలులతో ప్రజలు బయటికి రావాలంటేనే భయపడుతున్నారు. ప్రతి రోజు కూలి పనులకు వెళ్లే వారు సైతం ఎండ దెబ్బతో బయటకు వెళ్లాలంటేనే వెనుకంజ వేస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణం చేసే వారు తగిన జాగ్రత్తలు తీసుకుని వెళుతున్నారు. అధిక ఉష్ణోగ్రతలకు ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. రాయవరం మండలంలో అధిక ఉష్ణోగ్రతలకు ప్రధాన రహదారులే కాదు గ్రామాల్లో వీధులు కూడా నిర్మానుష్యంగా మారుతున్నాయి.

కరుణామయ యూత్ సేవలు అభినందనీయం



సాయం అందజేస్తున్న శామ్యూల్ పీటర్, సంస్థ సభ్యులు

మండపేట: కేశవరంలో కాయకష్టం చేసుకునే నిరుపేద యువకులు సంస్థగా ఏర్పడి ఉన్నంతలో ప్రతినెలా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండడం అభినందనీయమని పాస్టర్ డాక్టర్ కె.శామ్యూల్ పీటర్ పేర్కొన్నారు. రాజమహేంద్రవరం రూరల్ కొంతమూరులో కిడ్నీ సంబంధిత సమస్యతో బాధపడుతున్న నిరుపేద మహిళ బత్తిన నాగమణికి సంస్థ ఆధ్వర్యంలో రూ.5వేలు, 25 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు, దుస్తులను గురువారం శామ్యూల్ పీటర్, సంస్థ సభ్యుడు పోసుపో ప్రసాద్ అందజేశారు. సంస్థ అధ్యక్షుడు పోసుపో అశోక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు మందపల్లి పోలాప్రతాప్ మాట్లాడుతూ చేతనైనంతలో ప్రతి ఒక్కరూ ఇతరులకు సాయపడాలన్నారు. సంస్థ సభ్యులు పలివెల సత్తిబాబు, సమతం చిన్నపాపరావు, పోసుపో వినోద్, తవిటికి సాయి మహేష్, వినీత్, రామకృష్ణ, శెట్టి శ్రీను, పెన్నేటి చంద్రహాస్, చంద్రమళ్ల సుమంత్, దొండపాటి దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ పట్టివేత



స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ క్యారీ బాగులు, గ్లాసులతో మున్సిపల్ సిబ్బంది

రామచంద్రపురం: మున్సిపల్ కమిషనర్ టి.శ్రీకాంత్ రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని మున్సిపాలిటీ అధికారులు గురువారం చేసిన దాడుల్లో పెద్ద ఎత్తున ప్లాస్టిక్ గ్లాసులు, క్యారీ బ్యాగులను స్వాధీనం చేసుకున్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ డేవిడ్ రాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని పోతులవారి వీధిలోగల పూజా ప్లాస్టిక్స్ చెందిన గొడౌన్‌లో సుమారుగా రూ.20 నుంచి రూ.25 వేలు విలువైన ప్లాస్టిక్ గ్లాసులు, క్యారీ బ్యాగులు ఉన్నాయని వాటిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ప్లాస్టిక్ నిషేధం గురించి గతంలో చాలా సార్లు వివరించామన్నారు. పలు మార్లు అపరాధ రుసుములు కూడా వసూలు చేశామని వివరించారు. మూడు నెలల పాటు నిఘా ఉంచిన తరువాత సచివాలయ శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలు ఇచ్చిన సమాచారం మేరకు ఈ గొడౌన్‌లో అధిక మొత్తంలో నిల్వ చేసి ఉన్న ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, గ్లాసులను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

హిజ్రా హత్య కేసులో పురోగతి!

ఆలమూరు: 216 ఏ జాతీయ రహదారిలోని జొన్నాడ వద్ద ఈనెల 12న అర్ధరాత్రి సమయంలో దారుణహత్యకు గురైన హిజ్రా మరిపట్ల ఆనంద్ అలియాస్ ఆనంది (33) హత్య కేసులో ఆలమూరు పోలీసులు పురోగతి సాధించినట్లు తెలుస్తోంది. స్థానిక బస్టాండు సెంటర్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పుటేజీ ఆధారంగా స్థానికుల ఇచ్చిన సమాచారంతో ఎస్సై ఎస్.శివప్రసాద్ నేతృత్వంలో దర్యాప్తును వేగవంతం చేశారు. అత్యంత విశ్వసనీయ సమాచారాన్ని బట్టి ఈ కేసులో ఇప్పటికే పలువురు నిందితులను గుర్తించినట్లు తెలుస్తోంది. మరో రెండు రోజుల్లో ఈ కేసు ఓ కొలిక్కి వచ్చే అవకాశం ఉన్నట్లు భోగట్టా.

పవర్ టిల్లర్ల పంపిణీ

ఆలమూరు: రైతుల అభ్యున్నతి కోసం ప్రభుత్వ ప్రవేశపెడుతున్న వ్యవసాయ పరికరాలు, యంత్రాలను సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించాలని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆలమూరు బొబ్బా చినవీరన్న ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) కార్యాలయంలో ఏవో ఎస్.లక్ష్మీలావణ్య ఆధ్వర్యంలో రాయితీపై పవర్ టిల్లర్ల పంపిణీ గురువారం జరిగింది. ఏడుగురు రైతులకు రూ.14.55 లక్షల విలువైన పవర్ టిల్లర్లను 40 శాతం రాయితీపై రాయితీపై అందజేశారు. ఒక్కో పవర్ టిల్లర్ ఖరీదు రూ.2.08 లక్షలు కాగా రైతుకు రూ.52 వేలు రాయితీ మినహాయించి మిగతా సొమ్మును బ్యాంకు రుణంగా ప్రభుత్వం సమకూర్చింది. ఆర్బీకేల ద్వారా ధాన్యాన్ని విక్రయించిన రైతాంగానికి గడపులోపే గిట్టుబాటు ధరను బ్యాంకు ఖాతాలో జమ చేస్తున్నామని ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి పేర్కొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను మహిళా పోలీసులు పరిశీలించాలి

ఆత్రేయపురం: మండలంలోని ఉన్న మహిళా పోలీసులంతా వారి పరిధిలోని ఉన్న అంగన్ వాడీ కేంద్రాలను ప్రతి వారం సందర్శించి గర్భిణులు, బాలింతలు ఇంటికి వెళ్లి అంగన్‌వాడీల ద్వారా అందుతున్న సేవల గురించి తెలుసుకోవాలని ఎంపీడీఓ నాతి బుజ్జి తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని ఉన్న మహిళ పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళా పోలీసులు అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి సీఆర్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. చైల్డ్ ఆధార్ ఎన్‌రోల్ చేసేందుకు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. స్టాక్, హాజరు రిజిస్టర్ ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేశారో లేదో రికార్డు చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన అంశాల్లో అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు మెరుగుపర్చాలన్నారు. కార్యక్రమంలో మండలంలోని మహిళా పోలీసులు ఉన్నారు.

కోనసీమ రైలు కోసం విద్యార్థుల ర్యాలీ

అమలాపురం టౌన్: కోనసీమ రైలు కోసం కోనసీమ రైల్వే సాధన సమితి (కేఆర్ఎస్ఎస్) ఆధ్వర్యంలో విద్యార్థులు పట్టణ పుర వీధుల్లో గురువారం సాయంత్రం ర్యాలీ నిర్వహించారు. నత్తనడకన నడుస్తున్న రైల్వే నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్న డిమాండ్‌తో విద్యార్థులు ర్యాలీలో డిమాండ్ చేశారు. ర్యాలీలో ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, ఇళ్ల వెంకటేశ్వరరావులు పాల్గొని కోనసీమ రైల్వే పనులు త్వరితగతిన పూర్తి కావాలని ఆకాంక్షించారు. కోనసీమ నుంచి తమ అన్వేషణలు, కార్యకలాపాల ద్వారా రూ.కోట్ల ఆదాయం సముపార్జిస్తున్న చమురు సంస్థలు రైలు లైన్ నిర్మాణానికి తమ వంతు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు కోరారు. స్థానిక హైస్కూలు సెంటరు నుంచి గడియారం స్తంభం సెంటరు వరకూ ర్యాలీ సాగింది. కార్యక్రమంలో కోనసీమ రైల్వే సాధన సమితి కన్వీనర్ డాక్టర్ ఈఆర్ సుబ్రహ్మణ్యం, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, కార్యదర్శి యెండూరి నాగేశ్వరరావు, సప్పా నాగేశ్వరరావు, ఆర్వీ నాయుడు, ఉప్పుగంటి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.